
ఈవారం కథ

# చేపలు

మల్లిపూడి రామకృష్ణారావు



ఒళ్లంతా దుప్పటి చుట్టుకుని ముంగిట్లో గోడనానుకుని కూర్చున్నాడు నర్శింహులు. చూరు నుంచి ధారలు కడ్తున్న వర్షపునీరు మట్టి అరుగును ఒరుసుకుంటూ ప్రవహిస్తుంటే తదేకంగా చూస్తున్నాడు. ఈదురుగాలి, వర్షం వారం దినాలై వదలటం లేదు. ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. గాలి గుండెల్లోంచి దూసుకొస్తున్న వర్షపు హోరు వికృతంగా శబ్దం చేస్తోంది ఆగి ఆగి! వూరంతా స్తబ్ధుగా ముదుచుకుని కూర్చుంది. తడిసి జారిపోతున్న

## గూడులోంచి బెంగా చూస్తున్న కాకిలా వున్నాడు నర్సింహులు!

"ఛీ! పాడు వాన! ఒగ్గటం లేదు..." నోట్లోంచి బీడీని తీసి మరి వెలిగించటానికి పనికిరాదనుకుని నీట్లోకి గిరాటేశాడు దాన్ని.

"ఒరే! నర్సిగా!" నులకమంచం మీంచి నర్సింహులు తండ్రి పిల్చాడునీర్సంగా.

"ఆ ఏంటి నీ గోల?" విసుగ్గా అడిగాడు నర్సింహులు.

"రెండు పూటలా ఈ నప్పటి గంజినీళ్లు తాగలేక నస్తన్నారా! జివ్వ నచ్చిపోవాదిరా! నాలిక్కి రుసి తగలటం లేదరా అయ్యా!" గొణుగుతున్నట్లుగా అన్నాడు.

"నన్నేంటి సెయ్యమంటావో సెప్పు" కసురుకున్నట్లుగా వుంది ఆతని గొంతు.

"అలా కాలవగట్టుకెళ్లి నాలుగు పరిగెలు పట్టుకు రారాదా! కాసింత పులుసు కాసుకుంటే బాగుంటుందిరా! డాములోంచి సేప్పిల్లలు తూముకాడికి కొట్టుకొస్తాయిరా! ఇదేన్నా మంచి టయాము. సాలోజులైంది సేపల పులుసు తిని..." నులక మంచం మీద లేచి కూచుంటూ కొడుకు ముహం లోకి చూశాడు నర్సింహులు తండ్రి ఆశగా.

"పోసీ మావా! ముసిలోడికి మనసైంది గామాల! కాస్తంత ఎల్లరాదా ఏంటి కాలవకాడికి" నర్సింహులు భార్య వత్తాసు పలికింది.

"ఏది మనసులో దూరితే అదే! ఛీ! ఛీ!" సేపల పులుసు తినేవరకూ తండ్రి, భార్య ప్రాణం కొరికేస్తారని తెలిసి నర్సింహులు లేచి బద్ధకంగా వొళ్లు విరుచుకున్నాడొకసారి. వర్షం జోరు కాస్తంత తగ్గినట్టుగా వుంది. ఆటక మీదుంచిన గాలం తీశాడు. దాని కొక్కేన్ని బిగించి కట్టాడు. పెరట్లోకెళ్లి ఎరలేరుకు వచ్చాడు చిన్న రేకు డబ్బాలో. కర్రకు దించిన తాటాకు గొడుగేసుకుని బయల్దేరాడు వూరి చివర్న కాలవగట్టుకు. వర్షం జల్లు ఆగి ఆగి కొడ్తూంది బలంగా!

వరి పెద్దగా లేని చోట గట్టు మీద కూర్చున్నాడు. గాలానికి ఎరతగిలించి నీట్లోకి విసిరాడు. ప్రక్కన తూములోంచి మరగలు కక్కుతూ నీరు ప్రవహిస్తోంది. తడిసిపోయిన కోడిపుంజులా గొడుగులో ఒదిగి కూర్చుని నీటిమీద తేలుతున్న బెండు ముక్కను కనిపెట్టి చూస్తున్నాడు కన్నార్పకుండా! అరగంటైంది – ఓపిగ్గా నిరీక్షిస్తున్నాడు.

ఎర తగిలినట్లుంది! బెండుముక్క చివ్వుగా నీటిలోకి కదలటంతో మెరుపు వేగంతో గాలాన్ని గాలిలోకి లేపాడు నర్సింహులు.

కొక్కేనికి చిక్కుకున్న చేపను ఒడ్డుకు విసిరాడు.

శ్రమ ఫలించిన ఆనందం అతని ముహంలో లీలగా కదిలింది. ఎరను మార్చి మరలా గాలాన్ని నీట్లో వేశాడు.

"అయ్యసెప్పింది నిజమే...!" అనుకున్నాడు ఓ గంటలో ఐదారు చేపపిల్లలు తగలటంతో.

"భలే రుసిగా వుంటాయి సేపలు..." ఉడుకుతున్న చేపల పులుసు వాసన గుర్తొచ్చి నోరూరింది నర్సింహులికి.

"ఇంకపోవాలి... సేపలు నచ్చిపోకముందే పొయ్యెక్కిపోవాల... లేకపోతే అస్సలు రుసుండదు... గడ్డిలా గుంటాయి ... ఈ రకం సేపలు" అనుకుంటూ కమ్మరేకును వాటి మొప్పల్లోంచి దూర్చి గుత్తిలా కట్టాడు. గాలాన్ని చుట్టి లేచాడు వెళ్లటానికి ఉద్యుక్తుడవుతూ.

ఇంతలో –

కాలవగట్టుమీంచి వడిచొస్తున్న వాయ్డు చూశాడు నర్సింహుల్ని, వాడి చేతిలో వున్న చేపల గుత్తిని.

"ఏంట్రా! నర్సిగా! అబ్బో చేపలే! ఏదిరా సూద్దా" వాడి చేతిలోంచి లాక్కుని పైకెత్తి అటూ ఇటూ తిప్పాడా గుత్తును.

"భలేగుంటాయిరా... సైజు కూడా మా బలేగున్నాయిరోయ్ ఎదిగొచ్చిన అడగుంటల్లాగ!" వెండి తొడుగు తొడిగినట్లు మిలమిలా మెరిసిపోతున్న వాటిని చూసి వాయుడికి మనసు పుట్టింది వాటి మీద.

"ఒరేయ్! నర్సిగా! నువ్వో పనెయ్యిరా! ఇయి వాకిచ్చేయ్! మరో గంటో గడియో ఈడనే కూర్చో! డాములోంచి బోల్డు కొట్టుకొస్తున్నాయి! అయి పట్టి నువు దీసుకుపో..." నర్సింహులు ముహం లోకి చూస్తూ నవ్వుతూ అన్నాడు వాయుడు.

బిక్కమొహం వేసుకుని నిల్చుండిపోయాడు వాయుడికి ఎదురుచెప్పే ధైర్యం లేదు నర్సింహులుకు!

"ఒరేయ్! కిట్టిగా! ఇంద. ఇయి పట్టుకు పద ఇంటికి" వెంబడే వున్న కిట్టిగాడికందించి మరి నర్సింహులు వైపు చూడకుండా వూర్లోకి దారితీశాడు వాయుడు.

పిచ్చికుక్కలా వెంటబడి కరవాలన్నంత కోపం వచ్చింది నర్సింహులుకు... కాని ఆ వూర్లో వాయుడు తోడేలులాంటోడని తన తాతల తండ్రుల మంచీ ఎరిగిన నర్సింహులు కోపాన్ని దిగమింగుకుని ఉసూరంటూ నడిచాడు ఇంటికి.

"నాలుగు పెగ్గులేసుకుని... చేపల వేపుడు నంజుకుంటే... ఓహ్! భలే మజాగా వుంటుద్ది..." అనుకుంటూ హుషారుగా పెద్ద పెద్ద అంగలేస్తూ ఊర్లోకొచ్చాడు వాయుడు.

"పట్నం నుంచి గవర్రాజు హెడ్డు వచ్చిండు! గుమ్మంలో కూచోబెట్టి తమరికి సెబుదామని వస్తున్నా దొరా!" వాయుడి మనిషి ఎదురొచ్చి చెప్పాడు ఒగురుస్తూ.

"వస్తున్నా... పదపద..." వీడెందుకొచ్చాడబ్బా మళ్లీ అనుకుంటూ కలవరపడ్డాడు వాయుడు మనసులో.

హెడ్ కానిస్టేబిల్ గవర్రాజు సిగరెట్ కాలుస్తూ వసారాలో అసహనంగా తిరుగుతుండటం గమనించాడు వాయుడు గుమ్మంలోంచి.


సగం సగంతడిసిన ముతక కాకీ బట్టలు, మోకాళ్ల వరకూ బురద కొట్టుకుపోయిన పేంటుతో ఆనహ్యంగా కన్పిస్తున్నాడు గవర్రాజు.

"ఛీ! ఛీ! ఎదవుజ్జోగం... ఏళాపాళా లేదు!" మనసులో దుఃఖపడిపోతున్నాడు గవర్రాజు.

ఈ వాన, బురదలో పట్నానికి ఆరేడు కిలోమీటర్లున్న ఆ వూరు రావడమంటే యమ బాధనిపిస్తుందతనికి.

"ఓహో! హెడ్డుగారా! ఎంతసేపైంది వచ్చి? కులాసావా? ఇదిగో వరి సేలకు పీకల్దాకా నీరొచ్చిందని తెలిసి సూట్టానికి వెళ్లాను సేరీ వైపు..." పలకరించి కిట్టిగాడందించిన నీళ్లతో కాళ్లు కడుక్కుని అక్కడున్న పేము కుర్చీలో కూర్చున్నాడు వాయుడు.

"వాయుడుగారూ! మీకేం మీరు ఎంచక్కా ఇల్లూ వాకిళ్లూ చూసుకుంటూ హాయిగా వున్నారు... మధ్యన మాకు సచ్చే సావుగా వుంది! అబ్బ! ఈ చిత్తడిలో మీ వూరు నడిచిరావడం కంటే



రాత్రంతా అడవిలో మర్డరైన శవాన్ని కాపలా కాసే డ్యూటీయే నయమనిపిస్తుంది" ఖాకీ కోపం చూపించబోయి నాయుడి ఇనుఫ్లుయెన్స్ తెలిసిన గవర్రాజు వుక్రోషాన్ని గమ్మత్తుగా జోక్ కింద మార్చి అన్నాడు.

"హ్హా... హ్హా..... హ్హా..." నాయుడు పగలబడి నవ్వాడు.

గవర్రాజుకి వళ్లు మండిందా నవ్వు చూసి.

వారంరోజుల క్రిందటి నీటి తగాదాల్లో కొట్లాట జరిగిందా వూళ్లో! రెండు పార్టీవాళ్లు చెరో రెండు బక్క బనుషుల్ని ఖర్చు రాసేసుకున్నారా యుద్ధంలో! ఓ రెండ్రోజులపాటు అధికార్లు, అనధికార్లు బిజీగా తిరిగారావూరికి. ఇరవైమంది ఎడ్రసు లేనోళ్లని జ్యూడిషియల్ కస్టడీలో వుంచారు!

ఇన్వెస్టిగేషన్ డ్యూటీ మీద గవర్రాజు రెండు మూడు పర్యాయాలు రావల్సి వొచ్చిందా గ్రామానికి.

కిట్టిగాడు నాయుడి వెనకాలే నిల్చుండిపోయాడు చేపలు పట్టుకుని. హేడ్డు మళ్లీ ఎందుకొచ్చాడో, నాయుడితో ఏం చెవుతాడో అని బెదరు బెదురుగా చూస్తున్నాడు. వాడికీ మధ్య కాకీ బట్టల్ని చూస్తే గుండెల్లో రైళ్లు పరిగెత్తున్నాయి!

వాడి చేతిలో వున్న చేపల్ని చూశాడు గవర్రాజు! అవి మెలికలు తిరిగిపోతున్నాయి.

"డామ్‌లోంచి కొట్టుకొచ్చినావురా? ఇవి చాలా టేస్టుగా వుంటాయంటారు...!" వాటి వంక చూస్తూ అన్నాడు.

"మీకు కావాలేంటి?" మారాం చేస్తున్న పిల్లాడ్ని "తాయిలం కావాలా" అని అడిగినట్లడిగాడు నాయుడు గవర్రాజుని!

"ఒరే కిట్టిగా! అలా నిల్చుండిపోయావేంట్రా దయ్యం పట్టినోడిలా! లోపలికెళ్లి సంచీ పట్టుకురా! వాట్ని సంచీలో పెట్టి ఆ బాబుకియ్యి - అలా సరుగుడుతోట దాకా దిగబెట్టిరా! ఫలహారం పుచ్చుకువెళ్లండి..." అన్నాడు గవర్రాజు వైపు తిరిగి.

"లేదు... మళ్లీ వర్షం ముంచుకొస్తావుంది... వస్తాను" అంటూ లేచాడు గవర్రాజు ఆకాశం వంక జూస్తూ.

కిట్టిగాడు భయం భయంగా చేపల సంచీ పట్టుకుని హేడ్డు వెంట నడిచాడు తోట వరకూ.

"వస్తాన్దొరా..." సంచీ గవర్రాజు చేతికిచ్చి బ్రతుకుజీవుడా అనుకుంటూ వెనుదిరిగాడు కిట్టిగాడు.

సంచీలో చేపలు గింజుకుంటున్నాయి! ఆఖరి శ్వాస కోసం కొట్టుకుంటున్నాయవి! గవర్రాజు చేపలు కదలటం గమనిస్తూ వడివడిగా నడుస్తున్నాడు.

ఓసారి స్టేషన్‌కు పోయి ఎస్సైగార్ని కలసి ఇంటికి పోవటం మంచిదనిపించిందతనికి. పొద్దునవగా




దూసిన కరవాలములే
పదునను కొంటిని ఇదివరలో...
దాచిన తలపులు సైతం పదునే
ఇటు కనుగొంటిని ఎద ఒరలో...

వచ్చేశాడు స్టేషన్నుంచి - ఎస్సైగారేమైనా అనుకోవచ్చు. అతనికి కోపం వస్తే మళ్లీ ఇలాంటి దిక్కుమాలిన వూర్లే వెళ్లే డ్యూటీ వప్పజెప్తాడు అనుకుంటూ స్టేషన్‌కి వెళ్లాడు.

ఎస్సైగారున్నారు - అందరూ హడావిడిగా వుండడం కనిపించింది! స్యూట్ చేసి, ఎదురుగా నిల్చున్నాడు.

గవర్రాజుని చూసీచూడగానే ఎస్సై వుగ్రుడైపోయాడు!

"ఏమయ్యా! ఉదయాన్ననగా వెళ్లి ఇప్పుడా రావటం! డ్యూటీ మీదెళ్లావా లేకపోతే ఆ వూళ్లో కోడి పందాలు చూడ్డానికా?" అంటించిన సీమ టపాకాయ గుత్తులా ఫైర్ అయ్యాడు గవర్రాజు మీద.

గవర్రాజుకి ఒళ్లు చిటపటలాడింది. చచ్చీచెడీ వాగులూ, వంకలూ దాటుకుంటూ వస్తే ఆయనలా ధుమధుమలాడటం బాధనిపించింది. కుర్రకుంకలు ఎస్సైలుగా, సి.ఐ.లుగా వచ్చేసి తనలాంటి సీనియర్ మెన్‌ని కించపరచటం భరించలేకపోయాడు. అయినా కిమ్మనకుండా వుండిపోయాడు.

నాలుగేళ్ల క్రితం జరిగిన సంఘటన జ్ఞాపకం వచ్చి తనను తాను కంట్రోల్ చేసుకున్నాడు. సరిగా మీసకట్టు కూడా రాని ఓ కుర్ర ఎస్సై వచ్చాడు కొత్తగా. ఆ రోజు తనకు సబ్ జైల్ గార్డు డ్యూటీ! అర్ధరాత్రి దాటాక నిద్రనాపుకోలేక పోయాడు గవర్రాజు. పెళ్లి చేసుకుని ఇంకా వారం రోజులు కూడా కాలేదు ఎస్సైకి - ఇంత రాత్రిమీద ఏం వస్తాడులే అనుకుంటూ ధీమా పడిపోయి నిద్రపోయాడు! ఎప్పుడు వచ్చాడో ఏమో తెలుగు, ఇంగ్లీషు కలిపి తిడ్తున్న తిట్లకు తెలివొచ్చింది. కోపం ఆపుకోలేకపోయాడతను. మన్వెంతంటే నన్వెంతమనున్నారు ఇద్దరూ! ఫలితంగా తనకు ఆ సంవత్సరం రావాల్సిన ఎస్సై ప్రమోషన్ రాలేదు - మరింక వచ్చే అవకాశం లేదు. అది తలచుకుంటూ గుడ్లప్పగించి చూస్తూ వుండిపోయాడు గవర్రాజు.

"ఏంటలా జూస్తున్నావ్? చిన్న దొరగారు వస్తున్నారని ఇప్పుడే మెసేజ్ వచ్చింది - ఆ దొమ్మీ కేసు విషయంలో - నైట్ హాల్ట్ చేస్తారట. భోజనం, బంగళా ఏర్పాట్లు దగ్గరుండి చూడు" అంటూ ఏదో ఫైల్ కోసం టేబిల్ మీద వెతుకుతున్నాడు ఎస్సై.

ఎస్సైగార్ని ప్రసన్నం చేసుకోటానికి ఇంతకంటే మంచి అవకాశం దొరకదనుకున్నాడు గవర్రాజు.

"సార్! ఎలాగూ వెళ్లాను కదా అని ఆ రిజర్వాయర్ చేపలు తెచ్చాను. మంచి టేస్టుగా వుంటాయి - దొరగారికి వండిస్తాను..." చేపల సంచీ చూపించాడు ఎస్సైకి.

"వెరీగుడ్! మంచి పని చేశావ్! ఫ్రెష్‌గా వున్నాయా! ప్రిపరేషన్ బాగుండాలి..." హెచ్చరిస్తున్నట్లుగా చెప్పాడు ఎస్సై.

ఈలోగా సంచీలో చేపలు కదలటం ఆగిపోయినట్లుగా తోచింది గవర్రాజుకి! రాత్రి లాకప్‌లో వేసిన ముద్దాయి తెల్లవారేసరికి ఉలుకూ పలుకూ లేకపోవటంతో అనుమానమొచ్చి సెల్‌లోకి తొంగి చూసిన సెంట్రీలా గవర్రాజు సంచీలోకి చూశాడు. అవి అచేతనంగా వుండిపోయాయి!

"టూనాట్ త్రీ! ఇలా రావోయ్! ఇదిగో ఇవి తీసుకువెళ్లి కర్రీ చేయించు - జాగ్రత్త సుమా! రాత్రికి దొరగారికి వడ్డించాలి" వరండాలో వున్న కానిస్టేబిల్ చేతికిచ్చాడా చేపల సంచిని గవర్రాజు.

టూనాట్ త్రీ ఆ సంచీ పట్టుకుని సైకిలెక్కాడు ఆదరాబాదరాగా వాటిని వండించే డ్యూటీ మీద.

రాత్రి బంగళాలో - గవర్రాజు తనే స్వయంగా చేపలకూర వడ్డించాడు చిన్నదొరగారికి. మర్డర్ కేసులో దొరికిన ముద్దాయి కస్టడీలోంచి తప్పించుకుపోయినంత బాధగా మొహం పెట్టాడాయన ఆ చేపల కర్రీ నాలిక్కి తగలగానే! మరి భోజనం నయించక లేచి చేయి కడుక్కోవటం గవర్రాజు చూశాడు.

రెండ్రోజుల తర్వాత -

సదరు దొమ్మీ కేసులో ఫైల్ చేసిన ఎఫ్.ఐ.ఆర్. చాలా బలహీనంగా వుందని, ఈ విషయంలో ఎస్సైని అనుమానించాల్సి రావడంతో, ఎస్సై మీద డిపార్ట్‌మెంటల్ ఎంక్వయిరీ వేయడం జరిగిందని హెడ్ క్వార్టర్స్ నుంచి వచ్చిన మెమో చూసి ఎస్సైకి కళ్లు బైర్లు కమ్మాయి!

గవర్రాజుకు మాత్రం అర్థమైంది పొరబాటు ఎక్కడ జరిగిందో!

"పాపం! కుర్ర ఎస్సై... ప్చ్!" అనుకున్నాడు మనసులో గవర్రాజు.